
TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 17 | 28-05-2026 గురువారం | పేజీలు: 06 | వెల: 3/-


## రౌడీ కోసం 'కన్నప్ప' బ్యూటీ




# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ



**గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**
**లక్ష ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని ప్రకటన**
**జూన్ చివరి నాటికి మరో లక్ష ఇళ్లు సిద్ధం**
**హైదరాబాద్‌లో తొలి దశలో లక్ష ఇళ్ల లక్ష్యం**
**జీహెచ్ఎంసీలో 18 వేల ఇళ్ల మంజూరు**
**మహిళల పేరుపై ఉచిత రిజిస్ట్రేషన్**
**విలువైన ప్రభుత్వ భూముల్లో గృహ నిర్మాణం**
**సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ**
**బలహీన వర్గాలకు ప్రాధాన్యం: మంత్రి**
**యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణం**
**గత ప్రభుత్వంపై మంత్రి విమర్శలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, జూన్ నెల చివరి నాటికి మరో లక్ష ఇళ్లు సిద్ధం కానున్నాయని ఆయన వెల్లడించారు.
సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో తొలి దశలో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు అవసరమైన స్థలాల గుర్తింపుకు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 13 ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించినట్లు ఆయన వివరించారు.
జీహెచ్ఎంసీ పరిధిలో స్థలాల కొరత కారణంగా 18 వేల ఇళ్లకే మంజూరు చేయాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. పేదల గృహ అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను గుర్తించి వాటిలో గృహ నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. జీవనోపాధికి అనుకూలంగా ఉండే ప్రాంతాల్లోనే నివాసాలు నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు.
పేదల అవసరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని యుద్ధ ప్రాతిపదికన ..మిగతా 2లో



**తుమ్మిడిహెట్టి అంశంపై మహారాష్ట్ర సీఎంకు రేవంత్ లేఖ**
**ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై తెలంగాణ సర్కార్ ఫోకస్**
**బ్యారేజ్ ఎత్తు పెంపుతో లక్షల ఎకరాలకు సాగునీరు?**
**గ్రావిటీ ద్వారా నీటి తరలింపుపై తెలంగాణ లెక్కలు**


# తుమ్మిడిహెట్టిపై చర్చకు సిద్ధం..

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో అత్యంత కీలకమైన 'తుమ్మిడిహెట్టి బ్యారేజ్' నిర్మాణం , దాని ఎత్తుపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రికి అధికారికంగా ఒక లేఖ రాశారు. ఈ బ్యారేజ్ అంశంపై చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రతినిధుల బృందంతో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, అందుకు అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని రేవంత్ రెడ్డి ఆ లేఖలో కోరారు.గతంలో (2016 ఆగస్టు 23న) జరిగిన ..మిగతా 2లో

## సరిహద్దు రక్షణకు 'అమిత్ షా' వ్యూహం

**15 కి.మీ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ఆదేశం**
**జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ**
**రాజస్థాన్‌లోని భారత్-పాక్ సరిహద్దు జిల్లాల భద్రతపై సమీక్ష**
**సరిహద్దుల్లో స్మగ్లింగ్, చొరబాట్లను అరికట్టేందుకు కలెక్టర్లకు బాధ్యతలు**
**నకిలీ ఆధార్ కార్డులు, మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీలపై నిఘా ముమ్మరం**
**ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలు, పౌరుల భాగస్వామ్యంతో భద్రత**
**సరిహద్దు గ్రామాల అభివృద్ధి, వలసల నివారణ కోసం స్పెషల్ ప్రోగ్రామ్**
**సైబర్ నేరాల నియంత్రణకు '1930' కాల్ సెంటర్ వినియోగం**
**రెండు నెలల తర్వాత ప్రగతిపై పునఃసమీక్ష**
**అక్రమ వలసలు, జనాభా మార్పులపై అధ్యయనానికి హైలెవెల్ కమిటీ**




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారతదేశ సరిహద్దు భద్రతను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. దేశ సరిహద్దు ప్రాంతాలకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని రకాల అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతాధికారులను ఆదేశించారు. సరిహద్దుల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, చట్టవిరుద్ధమైన పనుల పట్ల 'జీరో టాలరెన్స్' (సహించేది లేదు) విధానాన్ని కఠినంగా ..మిగతా 2లో

## తెలంగాణలో చిరుజల్లులతో మారిన వాతావరణం

**ప్రజలకు ఉక్కపోత నుంచి ఊరట**
**హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో స్వల్ప వర్షా లు**
**పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ**
**గంటకు 40 కి.మీ వేగంతో ఈదురు గాలుల హెచ్చరిక**
**తదుపరి 2–3 గంటల్లో మరిన్ని వర్షా లు కురిసే అవకాశం**
**వేసవి వేడిగాలుల తర్వాత ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం**
**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**
**నగర వాసులకు తాత్కాలిక ఊరట ఇచ్చిన జల్లులు**
**వర్ష ప్రభావంతో రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం**
**వాతావరణ మార్పులపై నిరంతర పర్యవేక్షణ**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు, ఉక్కపోత పరిస్థితుల మధ్య ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. నిన్న రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురవడంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. దీర్ఘకాలంగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ జల్లులు తాత్కాలిక ఊరటను ..మిగతా 2లో

## పోలీసుల కస్టడీకి బండి భగీరథ్

**పోక్సో కేసులో సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు తరలింపు**
**మల్కాజిగిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి**
**చర్లపల్లి జైలు నుంచి నేరుగా పోలీసుల స్వాధీనం**
**మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తి**
**అనంతరం మొయినాబాద్ ఫాంహౌస్‌కు తరలింపు**
**ఘటన స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ ప్రక్రియ**
**కీలక ఆధారాల సేకరణపై దర్యాప్తు బృందం దృష్టి**
**కేసును వేగవంతం చేస్తున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు**
**రిమాండ్ ఖైదీగా చర్లపల్లి జైల్లో ఉన్న నిందితుడు**
**సాంకేతిక, ప్రత్యక్ష ఆధారాల సమీకరణకు చర్యలు**
**దర్యాప్తులో కీలక మలుపు దిశగా కేసు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఇప్పటికే ఈ నెల 16న అరెస్టయిన ఆయనను చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉంచగా, తాజా పరిణామాల నేపథ్యంలో మల్కాజిగిరి కోర్టు ..మిగతా 2లో

# సీబీఎస్ఈ ఫలితాల దుమారం

**'సిట్' దర్యాప్తునకు రాహుల్ గాంధీ డిమాండ్**
**కేంద్ర మంత్రి రాజీనామాకు కాంగ్రెస్ పట్టు**
**12వ తరగతి పరీక్షా ఫలితాల్లో భారీ అవకతవకలు**
**విపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు**
**సమాధాన పత్రాల తారుమారుపై విమర్శలు**
**'ఆన్‌స్క్రీన్ మార్కింగ్' విధానంపై దేశవ్యాప్తంగా ఆందోళన**
**ఫలితాల కుంభకోణంపై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలి**
**ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) వేయాలని డిమాండ్**
**'గ్లోబరేనా' సంస్థకు సీబీఎస్ఈ కాంట్రాక్ట్ ఇవ్వడంపై ప్రశ్నలు**
**బ్లాక్‌లిస్ట్ నేపథ్యం ఉన్న సంస్థకు అప్పగించడం వెనుక కుట్ర**
**విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేయాలన్న రాహుల్**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సీబీఎస్ఈ 12వ తరగతి బోర్డు పరీక్షా ఫలితాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన మూల్యాంకన విధానం వల్ల ఫలితాల్లో భారీ అవకతవకలు జరిగాయని, దీని వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉందని ..మిగతా 2లో

# అన్నాడీఎంకేలో ముగిసిన ముఠా గొడవలు

**చెన్నై, (డిడి9 వార్త):**

తమిళనాడు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే పార్టీలో గత కొన్ని రోజులుగా సాగుతున్న తీవ్ర అంతర్గత విభేదాలకు ఎట్టకేలకు తెరపడింది. పార్టీ అధినేత ఎడప్పాడి కె.పళనిస్వామి (ఈపీఎస్), సీనియర్ నేతలు ఎస్.పి.వేలుమణి, సీవీ షణ్ముగం వర్గాల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఒక కీలక పరిణామంతో ముగిసింది. ఒకరిపై ఒకరు కత్తులు దూస్తూ శాసనసభ స్పీకర్‌కు సమర్పించుకున్న వివాదాస్పద పిటిషన్లను ..మిగతా 3లో

**ఈపీఎస్, వేలుమణి వర్గాల మధ్య కుదిరిన సయోధ్య**
**పరస్పర ఫిర్యాదులను అధికారికంగా వెనక్కి తీసుకున్న వర్గాలు**
**చీఫ్ విప్‌ను నియమించాలని గతంలో స్పీకర్‌కు వేలుమణి వర్గం లేఖ**
**ఫిరాయింపు నిరోధక చట్టం కింద చర్యలు కోరిన పళనిస్వామి వర్గం**
**ఎడప్పాడి కె.పళనిస్వామితో భేటీ అయిన వేలుమణి బృందం**
**టీవీకే పార్టీకి మద్దతు ఇస్తున్నారనే ప్రచారానికి చెక్**
**తామంతా ఒక్కటేనని సీనియర్ల స్పష్టీకరణ**
**పదవుల కోసం కాకుండా పార్టీ భవిష్యత్తు కోసమే సలహాలు ఇచ్చామన్న వేలుమణి**
**కీలక భేటీకి సీవీ షణ్ముగం గైర్హాజరు**
**తమతోనే ఉన్నారంటూ క్లారిటీ ఇచ్చిన కోయంబత్తూరు ఎమ్మెల్యే**

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

**మొదటిపేజీ తరువాయి**

ఇళ్ల నిర్మాణం జరుగుతుందని పొంగులేటి తెలిపారు. ఒక్క రూపాయి ఫీజు కూడా లేకుండా మహిళల పేరుమీదే ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తామని ఆయన వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి కనీసం పది ఇళ్లు కూడా నిర్మించలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. రెండో విడతలో అదనంగా 2,000 ఇళ్లు కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

మొత్తంగా పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

# సీబీఎస్ఈ ఫలితాల దుమారం

**మొదటిపేజీ తరువాయి**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని, అలాగే నిజానిజాలను నిగ్గుతేల్చడానికి తక్షణమే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది సీబీఎస్ఈ బోర్డు పరీక్షల మూల్యాంకనంలో ప్రవేశపెట్టిన 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్' (ఓఎస్ఎం) అనే నూతన పద్ధతి కారణంగానే తమ జవాబు పత్రాలు తారుమారయ్యాయని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని దేశవ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలోనే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ విమర్శల జడివాన కురిపించారు.

ఈ ఫలితాల వివాదం వల్ల దేశవ్యాప్తంగా సుమారు 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం సాంకేతిక లోపం వల్ల జరిగిన పొరపాటు కాదని, కేంద్ర ప్రభుత్వం కావాలనే ఒక ప్రణాళిక ప్రకారం చేసిన ఉద్దేశపూర్వక కుట్రగా కనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. మూల్యాంకన బాధ్యతలను ఒక వివాదాస్పద ప్రైవేట్ సంస్థకు అప్పగించడం వెనుక ఉన్న మతలబు ఏంటని ఆయన నిలదీశారు. సీబీఎస్ఈ ఫలితాల స్కామ్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని, అయినా ప్రధాని మోదీ దగ్గర ఎప్పటిలాగే ఎలాంటి సమాధానం కానీ, జవాబుదారీతనం కానీ లేదని రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు.

పరీక్షల నిర్వహణ, మూల్యాంకన బాధ్యతలను దక్కించుకున్న 'కోఎంప్ట్' సంస్థ లీలలను రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఎండగట్టారు. ఈ కోఎంప్ట్ సంస్థ గతంలో 2019వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో 'గ్లోబరేనా' అనే పేరుతో పనిచేస్తూ ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ఇటువంటి ఘోరమైన దుశ్చర్యలకే పాల్పడిందని గుర్తుచేశారు. అప్పట్లో ఆ సంస్థ చేసిన తప్పుల వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, పేరు మార్చుకుని వచ్చినంత మాత్రాన ఆ సంస్థ నైజం మారిపోదని వ్యాఖ్యానించారు. అంతటి నల్లటి చరిత్ర ఉన్న సంస్థ నేపథ్యం గురించి కనీస విచారణ జరపకుండా, దేశంలోని 18.5 లక్షల మంది విద్యార్థుల జీవితాలను ఆ సంస్థ చేతిలో ఎలా పెడతారని సీబీఎస్ఈ అధికారులను ప్రశ్నించారు. అసలు కోఎంప్ట్ యాజమాన్యానికి, ప్రధాని మోదీ ప్రభుత్వ పెద్దలకు మధ్య ఉన్న సత్సంబంధాలు ఏంటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత 'జెన్ జెడ్' యువత కష్టార్జితాన్ని, వారి కెరీర్‌ను దొంగిలించడానికి ఎవరినీ ఒప్పుకోబోమని, ఈ అవినీతి మూలాలను తాము సమూలంగా నిర్మూలిస్తామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

మరోవైపు, ఈ సీబీఎస్ఈ ఫలితాల అక్రమాలపై కాంగ్రెస్ సీనియర్ ఎంపీ జైరాం రమేశ్ సైతం కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దేశ విద్యా వ్యవస్థను ఇంతలా భ్రష్టుపట్టించిన ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవిని పట్టుకుని వేలాడటం, ప్రధాని మోదీ ఆయనను వెనకేసుకురావడం దేశానికే సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఏడాది 12వ తరగతి పరీక్షలకు ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానాన్ని నేరుగా అమలు చేయవద్దని, దానికి ముందు కొన్ని ప్రాంతీయ కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టులుగా నిర్వహించి లోపాలను సరిదిద్దాలని సీబీఎస్ఈ సొంత పాలకమండలి సభ్యులే హెచ్చరించినప్పటికీ, బోర్డు ఆ సలహాలను బేఖాతరు చేసిందని మీడియా నివేదికలను ఉటంకిస్తూ జైరాం రమేశ్ వెల్లడించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలోని అన్ని స్వతంత్ర సంస్థలను నిర్వీర్యం చేస్తోందని జైరాం రమేశ్ ఆరోపించారు. దేశ విద్యా విధానాలపై, సంస్కరణలపై చర్చించాల్సిన అత్యున్నత విభాగం 'కేంద్ర విద్యా సలహా మండలి' 2019వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా సమావేశం కాలేదని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం2020 సైతం ఈ సలహా మండలిని బలోపేతం చేయాలని చెబుతున్నా, ఆచరణలో మాత్రం విద్యాశాఖ దాన్ని పూర్తిగా పక్కనబెట్టేసిందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 2014కు ముందు ఈ కౌన్సిల్ ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకునేదని గుర్తుచేశారు. ధర్మేంద్ర ప్రధాన్ నాయకత్వంలో దేశంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో అవినీతి, అక్రమాలు మునుపెన్నడూ లేని విధంగా ప్రబలిపోయాయని జైరాం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ఉద్ఘాటించారు.

# 'తుమ్మిడిహట్టి'పై చర్చకు సిద్ధం..

**మొదటిపేజీ తరువాయి**

అంతర్రాష్ట్ర బోర్డు (InterState Board) సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తుతో (FRL) బ్యారేజ్ నిర్మించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అవసరమైన అన్ని అనుమతులకు సహకరిస్తామని కూడా అప్పట్లో తెలిపింది. అయితే, నిలిచిపోయిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేయాలని సంకల్పించిన రేవంత్ సర్కార్.. ఇటీవల ఈ ప్రాజెక్టుపై సమగ్రంగా పునఃసమీక్ష నిర్వహించింది.

**ఎత్తు పెంచితేనే తెలంగాణకు ప్రయోజనం..**
**ముంపు చాలా తక్కువ!**

ఇంజనీరింగ్ నిపుణుల సూచనల ప్రకారం.. 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజ్ నిర్మిస్తే ఉత్తర తెలంగాణ జిల్లాల నీటి అవసరాలను పూర్తిగా తీర్చడం సాధ్యం కాదని రేవంత్ సర్కార్ ఒక అంచనాకు వచ్చింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పరిధిలోని లక్షలాది ఎకరాల సాగునీటి అవసరాలను, ప్రజల తాగునీటి గోసను తీర్చాలంటే తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తుపై మహారాష్ట్రతో మరోసారి చర్చలు జరపడం అనివార్యమని సీఎం రేవంత్ రెడ్డి తన లేఖలో స్పష్టం చేశారు.

ఒకవేళ బ్యారేజీ ఎత్తును 148 మీటర్ల కంటే కాస్త పెంచినప్పటికీ, మహారాష్ట్ర వైపు జరిగే ముంపు ప్రభావం చాలా తక్కువగానే ఉంటుందని రేవంత్ రెడ్డి ఆ లేఖలో సాంకేతికంగా వివరించారు. ఎఫ్ఆర్ఎల్ (FRL) ఎత్తును పెంచడం ద్వారా అదనపు పంపింగ్ ఖర్చులు లేకుండా, కేవలం గ్రావిటీ (సహజ ప్రవాహం) ద్వారానే



తెలంగాణలోని బీడు భూములకు సులభంగా నీటిని తరలించే వీలుంటుందని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రికి పంపిన లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

# పోలీసుల కస్టడీకి బండి భగీరథ్

**మొదటిపేజీ తరువాయి**

మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు ఆయనను తమ అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

కస్టడీ ఆదేశాలు వెలువడిన వెంటనే చర్లపల్లి జైలు నుంచి భగీరథ్‌ను నేరుగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయనను ముందుగా మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ నిబంధనల ప్రకారం కస్టడీకి తీసుకునే ప్రతి నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రక్రియ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని నమోదు చేసి తదుపరి దర్యాప్తు చర్యలకు పోలీసులు ముందుకు సాగారు.

వైద్య పరీక్షలు పూర్తయ్యిన తరువాత పోలీసులు భగీరథ్‌ను మొయినాబాద్ పరిధిలోని అరణ్య ఫాంహౌస్‌కు తరలించారు. కేసులో కీలకమైన ఘటనలు చోటుచేసుకున్న ప్రాంతంగా భావిస్తున్న నేపథ్యంలో అక్కడ సీన్ రీకన్‌స్ట్రక్షన్ (ఘటన పునర్నిర్మాణం) ప్రక్రియ చేపట్టారు. ఘటన జరిగిన విధానం, పరిస్థితులు, సమయ క్రమం వంటి అంశాలను నిందితుడి వివరణ ఆధారంగా పునరావృతం చేసి దర్యాప్తుకు అవసరమైన ఆధారాలను సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, కేసులో ఇప్పటికే సేకరించిన ఆధారాలను మరింత బలపరచడం, సంఘటనల క్రమాన్ని స్పష్టంగా నిర్ధారించడం ఈ కస్టడీ ప్రధాన లక్ష్యంగా ఉంది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ ద్వారా నిందితుడి వాంగ్మూలాన్ని భౌతిక పరిస్థితులతో సరిపోల్చి పరిశీలించే అవకాశం ఉంటుంది. తద్వారా దర్యాప్తులో ఉన్న సందేహాలకు స్పష్టత తీసుకురావాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసు ప్రారంభమైనప్పటి నుంచి పేట్‌బషీరాబాద్ పోలీసులు వేగంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేసిన తరువాత చర్లపల్లి జైలుకు రిమాండ్ చేయగా, విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని గుర్తించిన నేపథ్యంలో కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు అనుమతి ఇవ్వడంతో ఇప్పుడు మూడు రోజులపాటు నిందితుడిని లోతుగా విచారించే అవకాశం పోలీసులకు లభించింది.

కస్టడీ సమయంలో పోలీసులు వివిధ కోణాల్లో ప్రశ్నలు అడుగుతున్నట్లు సమాచారం. కేసులోని పరిణామాలు, సంబంధిత వ్యక్తుల పాత్ర, ఘటనకు ముందు జరిగిన సంఘటనలు, ఆర్థిక లేదా ఇతర నేపథ్య అంశాలు వంటి వివరాలను సమగ్రంగా సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా సాంకేతిక ఆధారాలు, మొబైల్ డేటా, కాల్ రికార్డులు, మరియు ఇతర డిజిటల్ ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

సీన్ రీకన్‌స్ట్రక్షన్ ప్రక్రియలో నిందితుడు చూపించిన వివరాలను పోలీసులు రికార్డు చేస్తున్నారు. ఘటన జరిగిన స్థలంలో ఎలా పరిస్థితులు ఉన్నాయో, ఎవరు ఎప్పుడు అక్కడికి వచ్చారో వంటి అంశాలను ఖచ్చితంగా నిర్ధారించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఈ ఆధారాలు కేసు భవిష్యత్తు దర్యాప్తులో కీలకంగా మారే అవకాశం ఉంది.

మరోవైపు, ఈ కేసు పట్ల చట్టపరమైన ప్రక్రియను కూడా పోలీసులు కఠినంగా అమలు చేస్తున్నారు. పోక్సో చట్టం కింద నమోదైన ఈ కేసు కావడంతో ప్రత్యేక జాగ్రత్తలతో విచారణ కొనసాగుతోంది. బాధితుల గోప్యత, సున్నితమైన అంశాల రక్షణకు సంబంధించి అధికారులు అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

మూడు రోజుల కస్టడీ పూర్తయ్యేలోపు మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే సేకరించిన ఆధారాలతో పాటు నిందితుడి నుంచి వచ్చే సమాచారాన్ని క్రాస్ వెరిఫై చేయడం ద్వారా కేసును మరింత బలపరచాలని దర్యాప్తు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో దర్యాప్తు పురోగతిపై పోలీసు శాఖ కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. న్యాయపరమైన ప్రక్రియను పూర్తిగా అనుసరిస్తూ, ఆధారాల బలంతోనే కేసును ముందుకు తీసుకెళ్లాలని అధికారులు భావిస్తున్నారు. మొత్తానికి, సీన్ రీకన్‌స్ట్రక్షన్‌తో ప్రారంభమైన ఈ కస్టడీ విచారణ కేసులో కొత్త మలుపులకు దారితీయవచ్చని భావిస్తున్నారు. దర్యాప్తు పూర్తయ్యే కొద్దీ మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# సరిహద్దు రక్షణకు 'అమిత్ షా' వ్యూహం

**మొదటిపేజీ తరువాయి**

అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. రాజస్థాన్‌లోని భారత్ పాకిస్తాన్ సరిహద్దు జిల్లాల్లో నెలకొన్న భద్రతా పరిస్థితులు, సవాళ్లపై న్యూఢిల్లీలో అమిత్ షా ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీకి రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మతో పాటు రక్షణ, అంతర్గత భద్రతా విభాగాలకు చెందిన పలువురు అగ్రశ్రేణి అధికారులు హాజరయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు వీలుగా, ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర హోంశాఖ అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

సరిహద్దు జిల్లాల గుండా సాగే ఆర్థిక నేరాలు, అక్రమ నిధుల సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో జరిగే అన్ని రకాల బ్యాంకింగ్ లావాదేవీలను నిరంతరం పర్యవేక్షించాలని, చట్టపరమైన నిబంధనలు సరిగ్గా అమలు అవుతున్నాయో లేదో తనిఖీ చేయాలని హోంశాఖ అధికారులను ఆదేశించింది. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో చలామణిలో ఉన్న పెద్ద పెద్ద వ్యాపార సంస్థల నిధుల మూలాలను, వాటికి ఎక్కడి నుంచి డబ్బులు వస్తున్నాయనే కోణంలో లోతుగా పరిశీలించనున్నారు. ఇతరుల పేర్లతో నడిచే మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీల (షెల్ కంపెనీలు) ఆర్థిక కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలని స్పష్టం చేసింది. దీనితో పాటు దేశ భద్రతకు ముప్పుగా మారిన నకిలీ ఆధార్ కార్డులను త్వరితగతిన గుర్తించాలని, సరిహద్దుల గుండా జరిగే ఆయుధాలు, నిత్యావసరాల స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. సరిహద్దు జిల్లాల్లో యువతను పాడుచేస్తున్న డ్రగ్స్ మహమ్మారి వెనుక ఉన్న అంతర్జాతీయ నెట్‌వర్క్‌లపై లోతైన అధ్యయనం చేసి, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారాలను కనుగొనాలని అమిత్ షా సూచించారు.

సరిహద్దుల్లో నివసించే ప్రజలు ఉపాధి లేక లేదా మౌలిక వసతుల కొరత వల్ల పట్టణాలకు వలస వెళ్లకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్'ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా సరిహద్దు గ్రామాల్లో రహదారులు, విద్యుత్, తాగునీరు, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలను కల్పించనున్నారు. ప్రతి సరిహద్దు జిల్లాలో స్థానిక పౌరులు, ప్రభుత్వ యంత్రాంగం, మరియు సరిహద్దు భద్రతా దళం (BSF) వంటి రక్షణ సంస్థలను సమన్వయం చేస్తూ ఒక '360డిగ్రీల భద్రతా కవచాన్ని' ఏర్పాటు చేయాలని కేంద్ర హోంమంత్రి పిలుపునిచ్చారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల రవాణా, భూ ఆక్రమణలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం వంటి దేశద్రోహ చర్యలను అడ్డుకోవడానికి బీఎస్ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ మరియు స్థానిక పోలీసు యంత్రాంగం ఒక ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగాలని ఉద్ఘాటించారు. సరిహద్దు గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ వంద శాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటం ద్వారా వారిలో దేశభక్తిని, భద్రతా భావాన్ని పెంపొందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సరిహద్దు ప్రాంతాల్లో సైబర్ నేరాల ముప్పు కూడా పెరుగుతోందని, దీన్ని ఎదుర్కొనేందుకు '1930' జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ కాల్ సెంటర్‌ను ప్రజలు, అధికారులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని అమిత్ షా కోరారు. ఇప్పుడు తీసుకున్న భద్రతా చర్యలు, ఆదేశాల అమలుపై సరిగ్గా రెండు నెలల తర్వాత తానే స్వయంగా మరోసారి సమీక్ష నిర్వహిస్తానని హోంమంత్రి వెల్లడించారు. ఈసారి నిర్వహించే భేటీలో ప్రతి జిల్లా సాధించిన ఫలితాల ఆధారంగానే అధికారుల పనితీరును అంచనా వేస్తామని, కాబట్టి క్షేత్రస్థాయిలో మార్పు స్పష్టంగా కనిపించాలని హెచ్చరించారు. సరిహద్దుల రక్షణ అనేది కేవలం సైన్యానికి సంబంధించినది మాత్రమే కాదని, స్థానిక పరిపాలన కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు.

మరోవైపు, దేశంలోకి జరుగుతున్న అక్రమ వలసల ప్రభావం ఇప్పుడు కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాలేదని, దీనివల్ల దేశంలోని అంతర్గత జనాభా సమతుల్యత దెబ్బతింటోందని కేంద్ర హోంశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. అక్రమ వలసల ప్రభావం దేశంలోని పెద్ద పెద్ద పట్టణ కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, గిరిజన ప్రాంతాలు మరియు సామాజికంగా, ఆర్థికంగా అత్యంత సున్నితమైన ప్రాంతాల వరకు విస్తరించిందని ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ తీవ్రమైన సమస్యను అధ్యయనం చేయడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవోలేకర్ నేతృత్వంలో 'జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ' ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఢిల్లీ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఈ కమిటీలో దేశ సెన్సస్ కమిషనర్‌తో పాటు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా నియమితులయ్యారు. ఈ హైలెవెల్ కమిటీ దేశవ్యాప్తంగా పర్యటించి, అక్రమ వలసల వల్ల జరుగుతున్న జనాభా మార్పులపై ఏడాదిలోగా కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించనుంది.

# తెలంగాణలో చిరుజల్లులతో మారిన వాతావరణం

**మొదటిపేజీ తరువాయి**

అందించాయి.

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా సికింద్రాబాద్, బాలానగర్, బోయిన్‌పల్లి, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి, లక్డీకాపూల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం వంటి ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షం కొద్దిసేపు మాత్రమే కురవగా, మరికొన్ని చోట్ల మోస్తరు జల్లులుగా నమోదైంది.

వర్షం కారణంగా నగరంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. రోజంతా 40 డిగ్రీలకు పైగా నమోదైన ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో వీచిన చల్లని గాలులతో వాతావరణం మరింత సౌకర్యవంతంగా మారింది. అయితే వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక ట్రాఫిక్ అంతరాయాలు చోటుచేసుకున్నాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో స్థానికులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్ కర్నూల్, నల్గొండ, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, జోగులాంబ గద్వాల్, మహబూబ్ నగర్, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో తదుపరి 2-3 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గంటకు 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. బలమైన గాలుల కారణంగా చెట్లు కూలే ప్రమాదం, విద్యుత్ అంతరాయాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం లేకుండా బయటకు వెళ్లకూడదని సూచించింది.

వాతావరణ నిపుణుల ప్రకారం, ప్రస్తుతం రాష్ట్రంపై ఉన్న తేమతో కూడిన గాలులు మరియు స్థానికంగా ఏర్పడిన వాతావరణ అస్థిరత కారణంగా ఈ చిరు జల్లులు కురుస్తున్నాయి. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆకస్మికంగా ఏర్పడిన ఈ వర్షాలు సాధారణంగా కొన్ని గంటల పాటు మాత్రమే కొనసాగుతాయని వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ వర్షాలు కనిపించాయి. కొన్ని చోట్ల పొలాల్లో తాత్కాలిక నీటి నిల్వలు ఏర్పడ్డాయి. ఇది కొంతమేరకు రైతులకు ఉపశమనం కలిగించినప్పటికీ, అకస్మాత్తుగా వచ్చిన గాలులతో కొన్ని పంటలకు స్వల్ప నష్టం జరిగే అవకాశం కూడా ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో రాత్రి సమయంలో వర్షం కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. ఎయిర్ కండిషనర్ వినియోగం తగ్గి ప్రజలు సహజ గాలిని ఆస్వాదించే పరిస్థితి ఏర్పడింది. చాలా మంది నగరవాసులు వర్షాన్ని ఆస్వాదిస్తూ సోషల్ మీడియాలో వీడియోలు, ఫోటోలు



పంచుకున్నారు. మొత్తం మీద ఈ వాతావరణ మార్పు రాష్ట్ర ప్రజలకు తాత్కాలిక ఊరట ఇచ్చింది. అయితే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే గంటల్లో మరింత వర్షం కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వర్షపాతం కొనసాగితే రవాణా, విద్యుత్, దైనందిన కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ అయ్యాయి. ప్రజలు వాతావరణ సమాచారాన్ని అనుసరించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మంత్రి సీతక్క చేతుల మీదుగా పదవ తరగతి లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస

**కొత్తగూడ,మే 27(డీడీ9 వార్త):**

ఓటాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన 20252026 విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో 500 పై చిలుకు మార్కులు సాధించడం జరిగింది అందులో సౌరం నాగచైతన్య 529,ధనసరి హర్షిత పటేల్ 523,మాలోత్ విష్ణువర్ధన్ 499,మాలోత్ రాంచరణ్ 498మార్కులతో అద్భుతమైన ప్రతిభ కనపర్చడం జరిగింది ఈ సందర్భంగా గౌరవ మంత్రివర్యులు సీతక్క గారు, కలెక్టర్ స్నేహ సెబారీష్, జిల్లా విద్యాశాఖధికారి సత్యనారాయణ మూర్తి, యస్ పి షేబారీష్ గార్లచే విద్యార్థులను అభినందించి సన్మానం చేయనైనది, ఈ కార్యక్రమం లో ఓటాయి సర్పంచ్ గట్టి రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరోజు రమాదేవి, కొత్తగూడ మండల విద్యాశాఖధికారి గుమ్మడి లక్ష్మీనారాయణ, పాఠశాల స్టాఫ్ అజ్మీరా కోటేశ్వర్, వన ప్రేమి డాక్టర్ పులుసం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# వ్యక్తిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఇద్దరిపై కేసు నమోదు.

- పరువు తీస్తామని బెదిరిస్తూ పంచాయతీ పేరుతో డబ్బులు డిమాండ్.
- భయభ్రాంతులకు గురిచేసి రూ.50 వేల రూపాయలు వసూలు.
- ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ సీఐ కె నరేష్ కుమార్



**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్)**

ఇచ్చోడ మండలంలోని సిరిచల్మ గ్రామానికి చెందిన రాజారపు సందీప్ అనే వ్యక్తి ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ ఎస్హెచ్ఓ కె నరేష్ కుమార్ తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, బాధితుడికి ఒక మహిళతో అక్రమ సంబంధం ఉండగా ఆ విషయం ఆమె భర్తకు తెలిసింది. అనంతరం గ్రామానికి చెందిన అబ్దుల్ అజీమ్, కాలా రవీందర్ కలిసి పంచాయతీ నిర్వహించి, గ్రామంలో విషయం బయటపడితే పరువు పోతుందని, సమస్యను పరిష్కరించాలంటే రూ.1,50,000/ ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించడంతో భయాందోళనలకు గురైన బాధితుడు తన సోదరుడు ద్వారా రూ.50,000/ నగదును వారికి అందజేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కె నరేష్ కుమార్ తెలిపారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆపదలో చిన్నారికి అండగా దాతలు

- హనుమాన్ నగర్ యువత చొరవ.. వరుణ్ చికిత్సకు ఆర్థిక సాయం

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

మండల కేంద్రంలోని హనుమాన్ నగర్‌కు చెందిన కవిత కుటుంబానికి అనుకోని విషాదం ఎదురైంది. భర్తను కోల్పోయిన కవిత కూలి పని చేస్తూ ఇద్దరు కుమారులను పోషిస్తోంది. ఇటీవల ఆమె కుమారుడు వరుణ్ ప్రమాదవశాత్తు కిందపడటంతో చేతి నరాలు దెబ్బతిన్నాయి. హైదరాబాద్‌లో వైద్యులు తక్షణ సర్జరీ అవసరమని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబ పరిస్థితిని గమనించిన హనుమాన్ నగర్ యువత దాతల సహాయం కోసం ముందుకొచ్చారు. వారి పిలుపుకు స్పందించిన పలువురు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. పవార్ రవి నాయక్ రూ.5,000, గిత్తే మదన్ రూ.5,000, బాలే లహుదాస్ రూ.2,000, అవినాష్ కత్తే వార్ రూ.1,000 సహా మరికొందరు సహాయం చేశారు. దాతలకు, యువతకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. బాలుడు వరుణ్ త్వరగా కోలుకోవాలని స్థానికులు ఆకాంక్షించారు.



# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: ఏపీఎం కిరణ్ కుమార్

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రతి మహిళను ఆర్థికంగా బలోపేతం చేసి లక్షాధికారులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని ఐకేపీ ఏపీఎం కిరణ్ కుమార్ అన్నారు. కమ్మర్ పల్లి మండలం కోనాసముందర్ గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సమైక్య సంఘ భవనానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో మండల వ్యాప్తంగా 12 కొత్త భవనాలను మంజూరు చేశామని తెలిపారు. కోనాసముందర్ గ్రామంలో మహిళా సంఘాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, వారి సౌకర్యార్థం అదనంగా మరో రెండు భవనాలను మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ బెజ్జారపు రాకేష్ మాట్లాడుతూ... మహిళల అవసరాలను గుర్తించి భవనాలు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి పథకాలు మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. మహిళలను ఆర్థికంగా స్వతంత్రులుగా మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీసీ రవి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మహేందర్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు బట్టల సతీష్, మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు నస్రీన్ బేగం, మేఘన, నాయకులు భూమారెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# అన్నాడీఎంకేలో ముగిసిన ముఠా గొడవలు

మొదటిపేజీ తరువాయి

ఇరు వర్గాలు అధికారికంగా వెనక్కి తీసుకున్నాయి. దీంతో పార్టీ ముక్కలవుతుందేమోనన్న క్యాడర్ ఆందోళనలు తొలగిపోయి, నేతల మధ్య మళ్లీ పాత సయోధ్య కుదిరినట్లయింది. పార్టీలోని చిన్నచిన్న అభిప్రాయ భేదాలను పక్కనపెట్టి, రాబోయే రోజుల్లో కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు ఒక అవగాహనకు వచ్చారు. ఈ పరిణామం తమిళనాడు రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

ఈ వివాదానికి గల కారణాలను పరిశీలిస్తే.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అన్నాడీఎంకే ఆశించిన ఫలితాలను సాధించలేకపోయింది. దీనిపై అసంతృప్తితో ఉన్న ఎస్.పి.వేలుమణి, సీవీ షణ్ముగం నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం ఈపీఎస్ నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబావుటా ఎగురవేసింది. పార్టీకి కొత్త శాసనసభాపక్ష నేతను, అలాగే కొత్త చీఫ్ విప్‌ను నియమించాలని కోరుతూ ఈ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకరన్‌కు ఒక లేఖను కూడా సమర్పించారు. దీనికి ప్రతిచర్యగా పార్టీ జనరల్ సెక్రటరీ ఎడప్పాడి కె.పళనిస్వామి (ఈపీఎస్) వర్గం కూడా గట్టిగానే స్పందించింది. తిరుగుబాటుకు పాల్పడిన ఎమ్మెల్యేలపై 'ఫిరాయింపు నిరోధక చట్టం' కింద అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ వద్ద పిటిషన్ దాఖలు చేసింది. ఇలా ఇరువర్గాలు స్పీకర్ కార్యాలయాన్ని వేదికగా చేసుకుని ఘర్షణకు దిగడంతో పార్టీలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే, బుధవారం నాటి పరిణామాలు పార్టీలో ఊహించని మార్పును తీసుకొచ్చాయి. ఎస్.పి.వేలుమణి నేతృత్వంలోని తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందం నేరుగా ఎడప్పాడి కె.పళనిస్వామితో సమావేశమైంది. ఈ సుదీర్ఘ భేటీలో ఇరు వర్గాల నేతలు తమ మనసులోని భావాలను, అభ్యంతరాలను ముక్కుసూటిగా పంచుకున్నారు. గతంలో జరిగిన పొరపాట్లకు గాను వేలుమణి వర్గం ఎమ్మెల్యేలు ఈపీఎస్‌కు క్షమాపణలు తెలుపుతూ ఒక లేఖను కూడా అందజేశారు. దీంతో పాత కోపతాపాలను మరిచిపోయిన పళనిస్వామి, వారిని కలుపుకుని పోవడానికి అంగీకరించారు. పార్టీని బలోపేతం చేసేందుకు సీనియర్లందరితో త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని, అలాగే పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఒక ఉమ్మడి కమిటీని కూడా వేస్తానని ఈపీఎస్ హామీ ఇచ్చారు.

ఈ కీలక భేటీ అనంతరం అన్నాడీఎంకే సీనియర్ నేత, కోయంబత్తూరు ఎమ్మెల్యే ఎస్.పి.వేలుమణి మీడియాతో మాట్లాడుతూ తమ మధ్య ఎలాంటి శతృత్వం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నూతన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం పార్టీకి తాము మద్దతు ఇస్తున్నట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారని, దాంతోనే తమ వర్గంలోని 25 మంది ఎమ్మెల్యేలపై ఈపీఎస్ వర్గం అనర్హత వేటు వేయాలని కోరిందని వివరించారు. తాము కూడా కోపంలో ఎదురు లేఖ ఇచ్చామని, కానీ ఇప్పుడు వాటన్నింటినీ వెనక్కి తీసుకున్నామని చెప్పారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, వందేళ్లయినా అన్నాడీఎంకే బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే తాము కొన్ని సలహాలు ఇచ్చామే తప్ప, పదవుల కోసం ఆశపడి కాదని వేలుమణి తేల్చి చెప్పారు. పళనిస్వామి ఇప్పటికీ, ఎప్పటికీ తమ పార్టీకి అసలైన సుప్రీం లీడర్ అని ఆయన కొనియాడారు.

కాగా, ఈ కీలకమైన రాజీ సమావేశానికి మరో సీనియర్ నేత సీవీ షణ్ముగం హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో పలు అనుమానాలకు తావిచ్చింది. దీనిపై వేలుమణి వెంటనే స్పందిస్తూ.. షణ్ముగం ఆఫీస్ నుంచే తామంతా కలిసి ఇక్కడికి వచ్చామని, ఆయన కూడా తమతోనే ఉన్నారని క్లారిటీ ఇచ్చారు. ఇందులో ఎలాంటి విభేదాలు లేవని కొట్టిపారేశారు. అనంతరం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలంతా కలిసి అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకరన్‌ను కలిసి, తామంతా అసెంబ్లీలో ఒకే పార్టీగా, ఒకే నాయకత్వంలో పనిచేస్తామని రాతపూర్వకంగా లేఖ సమర్పించారు. గతంలో తనను విప్‌గా గుర్తించాలంటూ విజయభాస్కర్ ఇచ్చిన లేఖను కూడా ఉపసంహరించుకున్నారు. ఎమ్మెల్యేల లేఖలను స్వీకరించిన స్పీకర్, దీనిపై తన తుది నిర్ణయాన్ని గురువారం అధికారికంగా ప్రకటిస్తానని తెలిపారు. మొత్తానికి ఈ రాజీ ఫార్ములాతో అన్నాడీఎంకేలో తాత్కాలికంగా సంక్షోభం సమసిపోయింది.

# బక్రీద్ బందోబస్తుపై ప్రత్యేక దృష్టి

- ఆర్మూర్ డివిజన్ అధికారులతో పోలీస్ కమిషనర్ సమీక్ష

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**



నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు రాబోయే బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆర్మూర్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ... రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, 24 గంటల పాటు చెక్‌పోస్టుల వద్ద నిరంతర వాహన తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల పురోగతిని సమీక్షిస్తూ, హత్యలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, గంజాయి అక్రమ రవాణా, పేకాట వంటి నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిఘాను పటిష్టం చేయడంతో పాటు, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారాను బలోపేతం చేయాలని సూచించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్, ఈగల్ టీమ్స్ మరియు చీతా ఫోర్స్ బృందాలు విద్యాసంస్థలు, బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని కమిషనర్ దిశానిర్దేశం చేశారు. డ్రగ్స్, గంజాయి, గుట్కా మరియు ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, అవసరమైతే నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీసీ కెమెరాల నిఘాను విస్తరించాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం మరియు రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారి ఇంజనీరింగ్ లోపాలు ఉంటే సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని, నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలతో పాటు ఓవర్ స్పీడ్, త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ప్రజల్లో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వర్ రెడ్డి, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, వివిధ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కమ్మర్ పల్లి లో అక్రమ గ్యాస్ సిలిండర్లు సీజ్

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

కమ్మర్ పల్లి లో గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచి, చిన్న చిన్న గ్యాస్ బుడ్డీలలోకి రీఫిల్ చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు నిజామాబాద్ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ పవన్ నేతృత్వంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని భరతమాత విగ్రహం సమీపంలోని సందులో గల కావాలి యాదగిరి అనే వ్యక్తి నివాసంలో సోదాలు నిర్వహించగా అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు గ్యాస్ సిలిండర్లను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... గృహ అవసరాలకు కేటాయించిన సబ్సిడీ సిలిండర్లను వాణిజ్య పరమైన అవసరాలకు లేదా అక్రమ రీఫిల్లింగ్ కోసం ఉపయోగించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న సిలిండర్లను స్థానిక గ్యాస్ గోదాముకు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను జిల్లా అడిషనల్ కలెక్టర్ (సివిల్ సప్లై)కు అందజేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్ఐ శరత్ కుమార్, జీపీఓలు కె. అశోక్, పి. అజయ్ మరియు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



# బక్రీద్ వేడుకల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత

- ముస్లిం సోదరులకు ప్లాస్టిక్ కవర్ల పంపిణీ

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

ఈ రోజు జరగనున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని భీమ్ గల్ పట్టణంలో పరిశుభ్రతను కాపాడేందుకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ... పండుగ వేడుకల అనంతరం వెలువడే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా అందజేసిన ప్లాస్టిక్ కవర్లలో సేకరించి మున్సిపల్ వాహనాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, పరిసరాల పరిశుభ్రతను కాపాడటంలో ప్రజలందరూ సహకరించాలని వారు కోరారు. వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, కేవలం మున్సిపల్ వాహనాల్లోనే వ్యర్థాలను వేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బోదిరే స్వామి, జై నర్సయ్య, అంజుమ్ అలీ, తోట సతీష్, సందీప్, సంగ్యా నాయక్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# సీసీ కెమెరాలే ఆధునిక నేత్రాలు

- బస్సాపూర్‌లో 18 కెమెరాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

మన ఊరుమన భద్రతమన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్సాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 18 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణ సులభతరమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడానికి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఈ కెమెరాలు ఎంతో కీలకంగా పనిచేస్తాయని కమిషనర్ వివరించారు. ప్రజలందరూ తమ భద్రతను బాధ్యతగా భావించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ముఖ్యంగా నగల దుకాణాల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బస్సాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన గ్రామ పంచాయతీని ఆయన అభినందించారు.

అనంతరం గ్రామంలో డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు రోడ్డు ప్రమాదాల నివారణపై కమిషనర్ ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేల సారం దెబ్బతింటుందని, అందుకు బదులుగా మల్టీ పొటాషియం వంటి పద్ధతులను పాటిస్తూ భూమి సారాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, బాల్కొండ ఎస్ఐ శైలేందర్, బస్సాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, శ్రీరాంపూర్ సర్పంచ్ ఎర్రన్న, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# మహిళా అభివృద్ధియే గ్రామ స్వరాజ్యం : ఎంపీడీవో

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని భీంగల్ ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం భీంగల్ మండలంలోని దేవన్‌పల్లి, కారేపల్లి తండా, రహత్ నగర్, కొత్త తండా మరియు తాళ్లపల్లి తండా గ్రామాలలో మహిళా ఐక్య సంఘాల భవన నిర్మాణాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... ప్రతి గ్రామంలోనూ మహిళలు తమ సమావేశాలను సజావుగా నిర్వహించుకోవడానికి, ఆర్థిక కార్యకలాపాలు చేపట్టడానికి ప్రత్యేక భవనాలు ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇందులో భాగంగానే ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి ఒక్కో భవనానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశామని ఆయన వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ఏపీఎం ప్రమీల, సీసీలు శ్రీనివాస్, నరేష్, రఘు, విక్రమ్, ఏఈ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు



# భీమ్‌గల్‌లో నూతన కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

భీమ్‌గల్ మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన కోర్టు భవన నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పరిశీలించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు పర్సా అనంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో భాగంగా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని గుత్తేదారుడికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన కోర్టును త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కోర్టు ప్రారంభమైతే స్థానిక కక్షిదారులకు న్యాయ సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. కోర్టు మంజూరు కోసం విశేష కృషి చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌లకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సంగ్య నాయక్, జిల్లా సర్పంచుల ఫోరం కార్యదర్శి అరిగేల జనార్ధన్, బాబపూర్, రాహత్ నగర్ ఉప సర్పంచులు గోవర్ధన్, సేవలాల్, సీనియర్ నాయకులు పల్లె శేఖర్, కోరాడి లింబాద్రి, రాగుల మోహన్, దిలీప్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎడపల్లిలో మూడో రోజుకు చేరిన వీవోఏల నిరసన

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండల కేంద్రంలోని మహిళా మండల సమైక్య కార్యాలయం ఆవరణంలో వివోఏలు చేపట్టిన శాంతియుత నిరసన, బైఠాయింపు కార్యక్రమం బుధవారానికి మూడో రోజుకు చేరుకుంది. ఇందిర క్రాంతి పథకం ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఏమాత్రం సరిపోవడం లేదంటూ వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల దరికి చేర్చడానికి తాము అహర్నిశలు కృషి చేస్తున్నా.. తమ శ్రమను ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమని వారు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా వివోఏలు డిమాండ్ చేశారు. అర్హులైన సిబ్బందికి పదోన్నతులు కల్పించడంతో పాటు, హెచ్ఆర్ బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని కోరారు. అలాగే నెలకు కనీసం 26 వేల రూపాయల గౌరవ వేతనాన్ని నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించేంత వరకు, తమ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేంత వరకు ఈ నిరవధిక సమ్మెను ఇలాగే కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ బైఠాయింపు కార్యక్రమంలో వీవోఏల మండల అధ్యక్షురాలు శోభతో పాటు మల్లెపూల, సుదర్శన్, యూసుఫ్, పోచయ్య, కుమ్మరి పుష్ప, లత, శోభ, సుమలత, కొమరవ్వ, జంగం సంధ్య మరియు ఆయా గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.




# శాంతియుతంగా పండుగ జరుపుకోవాలి : సీఐ వెంకట నారాయణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

బక్రీద్ పండుగను బోధన్ పట్టణ ప్రజలు పరస్పర సహకారంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ పట్టణ సీఐ వేంకట నారాయణ కోరారు. పండుగ వేళ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బోధన్ పట్టణంలో పోలీసులు విస్తృత పహారా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, నిత్యం రద్దీగా ఉండే వీక్లీ మార్కెట్ ప్రాంతాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ముఖ్య కూడళ్ల గుండా సీఐ వేంకట నారాయణ, ఎస్సై మనోజ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి కాలినడకన క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణవ్యాప్తంగా పకడ్బందీ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనదారులు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పండుగ నేపథ్యంలో రాత్రి వేళల్లో కూడా గస్తీని మరింత ముమ్మరం చేశామని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.





# బక్రీద్ వేళ అక్రమ పశువుల రవాణాపై ఉక్కుపాదం

- **దూద్‌గామ్ చెక్‌పోస్ట్ వద్ద పోలీస్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు**

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బుధవారం మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని దూద్‌గామ్ చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ బార్డర్ చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. రాష్ట్ర సరిహద్దుల గుండా అక్రమంగా తరలివచ్చే పశువుల వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అనుమానాస్పదంగా కనిపించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు కమిషనర్ స్పష్టం చేశారు. విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాల తనిఖీ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించాలని, బ్యారికేడ్లు మరియు హెచ్చరిక లైట్లను సరైన పద్ధతిలో వినియోగించాలని ఆదేశించారు. వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో నిలిపి తనిఖీలు చేపట్టాలని భద్రతా ప్రోటోకాల్‌లను గుర్తు చేశారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, మెండోరా ఎస్ఐ సుహాసిని ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# పెద్ద హనుమాన్ మందిరంలో ముగిసిన మూడేళ్ల చాలీసా పారాయణ వేడుకలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరంలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ప్రారంభమై విజయవంతంగా మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం ప్రత్యేక పారాయణ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ విశేష కార్యక్రమంలో భాగంగా హనుమాన్ చాలీసా పారాయణంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు చిన్నారులను ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆ చిన్నారుల విద్యాభ్యాసానికి ఉపయోగపడేలా ఎగ్జామ్ ప్యాడ్‌లు, స్కేల్‌లు, పెన్నులను ఆలయ కమిటీ తరఫున బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణ భక్తులు మాట్లాడుతూ... చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు క్రమశిక్షణను పెంపొందించేందుకు ఈ పారాయణం ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాబోయే రోజుల్లో కూడా చాలీసా పారాయణంలో ప్రతిభ కనబరిచే ప్రతి ఒక్క చిన్నారిని ఆలయం తరఫున ఇలాగే ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేస్తామని స్పష్టం చేశారు. పిల్లలందరూ చిన్నతనం నుంచే ఆసక్తితో హనుమాన్ చాలీసాను నేర్చుకుని తమ ప్రతిభను చాటాలని వారు కోరారు. ఈ మంగళకరమైన కార్యక్రమంలో గాయత్రి ఇడ్లీ సెంటర్ గంగాధర్, విజయ గురుస్వామి, కె. దత్తాత్రి, రవికాంత్, సిరిగిరి నాగనాథ్, రమేష్, బద్ధం సత్యనారాయణ, భక్తులు పాల్గొని పారాయణం చేశారు.



# సాలూరలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ తనిఖీలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

సాలూర మండల పరిధిలో వినియోగదారులకు అంతరాయం లేని, మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందుకు విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఏ మేర లోడ్ పడుతుందనే అంశాన్ని తెలుసుకునేందుకు అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాలూర లైన్మెన్ శివ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రత్యేక మీటర్ల సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్ల విద్యుత్ సామర్థ్యాన్ని, లోడ్ వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వ్యవసాయ, గృహ అవసరాల నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్లపై సామర్థ్యానికి మించి లోడ్ పడుతున్నట్లు ఈ తనిఖీల్లో గుర్తించారు. లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో



సాంకేతిక సమస్యలు తలెత్తి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల సూచనల మేరకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సిబ్బంది తెలిపారు.

# ముప్కాల్ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

ముప్కాల్ మండలంలో నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బుధవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను మరియు కల్పిస్తున్న మౌలిక వసతులను కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ భవనం ప్రజలకు సులభంగా చేరువయ్యే రీతిలో ఉండాలని, ఆధునిక సౌకర్యాలతో దీనిని తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఎటువంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని, పనులను వేగవంతం చేసి త్వరలోనే భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది పని తీరుకు అనుకూలంగా కార్యాలయ గదులు, రిసెప్షన్ సెంటర్, రికార్డు గదులు ఉండాలని, ముఖ్యంగా మహిళా సిబ్బంది కోసం ప్రత్యేక సౌకర్యాలు మరియు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, ముప్కాల్ ఎస్ఐ కిరణ్ పాల్ సిబ్బంది పాల్గొన్నారు.



# సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ విద్యకు అనుమతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి పిల్లలకు నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ముందడుగు పడింది. సాలూర మండల పరిధిలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో రాబోయే 202627 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ తరగతులను నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు మండల విద్యాధికారి రాజీవ్ మంజూష తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ సాలూర, ఎంపీయూపీఎస్ సాలూర (ఉర్దూ మీడియం)తో పాటు ఎంపీపీఎస్ కుమ్మన్ పల్లి పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రైవేటు పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేసి, ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నూతన విధానాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి ప్రీప్రైమరీ సెక్షన్‌కు ఒక ఉపాధ్యాయుడిని, ఒక ఆయాను కొత్తగా నియమించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే చిన్నారులకు అవసరమైన ఆధునిక ఫర్నిచర్, ప్లే మెటీరియల్ తదితర విద్యా సామగ్రిని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో త్వరలోనే సరఫరా చేయనున్నారు. బాల్య దశలోనే పిల్లలకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించడం ద్వారా ప్రభుత్వ రక్షణలో విద్యా హక్కును కాపాడవచ్చని విద్యాశాఖ భావిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు, ప్రాథమిక విద్యా పునాది మరింత బలోపేతం అవుతుందని స్థానిక విద్యావేత్తలు, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 103వ జయంతి


- **ముఖ్యఅతిథిగా బాన్సువాడ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర సలహాదారులు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి**

కోటగిరి పోతంగల్ మండల నాయకులు రేపు మాజీ ముఖ్యమంత్రివర్యులు ఎన్టీ రామారావు గారి 103వ జయంతి వేడు కలకు హాజరుకావాలని కోరుతున్నారు*

నిజామాబాద్ కోటగిరి మే 27 (డిడి9 వార్త): నిజామబాద్ జిల్లా కోటగిరి మరియు పోతంగల్ మండలాల ప్రజలకు పార్టీ కార్యక ర్తలకు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రివర్యులు NT రామారావు గారి 103వ,జయంతి సందర్భంగా ఎన్టీఆర్ చౌరస్తా, ప్రభుత్వ ఆసుపత్రి, మిర్జాపూర్ క్యాంప్ కోటగిరి లో, రేపు తేదీ 28052026 ఉదయం 9 గంటలకు నిర్వహించబడనున్న వేడుకలు, మరియు ప్రభుత్వ నిధులతో నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్ ఆసుపత్రి పక్కన ప్రారంభోత్సవ కార్యక్రమం కలదు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మన బాన్సువాడ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు గౌరవనీయులు పెద్దలు: పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు, పాల్గొనుచున్నారు.మరియు తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ పెద్దలు కాసుల బాలరాజు గారు, ఉమ్మడి జిల్లాల మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్న గారు,పాల్గొనుచున్నారు. ఉమ్మడి మండలాల ఏఎంసీ చైర్మన్ మాజీ జెడ్పిటిసి మాజీ ఎంపీపీలు మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,ఉమ్మడి మండలాల అన్ని గ్రామాల ఎన్నుకోబడిన సర్పంచులు, మరియు ఉమ్మడి మండలాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు మరియు ఉమ్మడి మండలాల సొసైటీ అధ్యక్షులు, ప్రజలు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని, మరియు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు ఉమ్మడి మండలాల పత్రిక విలేకరులు పాల్గొని విజయవంతం చేయాలని ,మీ ఆహ్వాన కమిటీ విన్నపము నమస్కారం.

**"ఇట్లు"**

**మిర్జాపూర్ ఆహ్వాన కమిటీ కోటగిరి.**





## జాడి జమాల్పూర్‌లో యూరియా కోసం రైతుల ఆందోళన

**బోధన్,నిజామాబాద్ జిల్లా,మే 27(డీడీ9 వార్త) :**

సాలూర మండలంలోని జాడి జమాల్పూర్ సహకార సంఘం కార్యాలయం వద్ద బుధవారం రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పంటలకు అవసరమైన యూరియా సకాలంలో అందడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సొసైటీ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రస్తుత తరుణంలో పంటలకు యూరియా వేయకపోతే చేతికొచ్చే దశలో పంట తీవ్రంగా దెబ్బతిని నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సొసైటీల్లో అమలు చేస్తున్న ఆన్‌లైన్ పంపిణీ పద్ధతి వల్ల తమకు సకాలంలో ఎరువులు అందడం లేదని, ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో ఉద్రిక్తత నెలకొనడంతో వ్యవసాయ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి... నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు శాంతించలేదు. అధికారుల వివరణతో ఏమాత్రం సంతృప్తి చెందని రైతులు మరింత ఆగ్రహానికి లోనై, సొసైటీ కార్యాలయానికి తాళం వేసి తమ నిరసనను ఉధృతం చేశారు. తమకు తక్షణమే తగినంత యూరియా పంపిణీ చేయాలని ఆన్‌లైన్ తిప్పలు లేకుండా పాత పద్ధతిలోనే ఎరువులు అందజేయాలని రైతులు స్పష్టం చేశారు.



## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**నిజామాబాద్ పోతంగల్ మే 27(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రం లోని హంగార్గ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత వివరాలు.ఏమనగా ఈరోజు 27.05.2026 రోజున ఉదయం 07:00 గంటల సమయంలో హంగర్గా గ్రామ శివారులోని మంజీరా నది నుండి ప్రభుత్వ అనుమతులు లేకుండా, అక్రమంగా ట్రాక్టర్ లో ఇసుకను లోడ్ చేసుకుని తరలిస్తున్న పుట్టి రాజు (డ్రైవర్), తండ్రి: హన్మంత్లు, వయస్సు: 28 సంవత్సరాలు, గ్రామం: హంగర్గా, మరియు అతని యజమాని పుట్టి రాజేష్, తండ్రి: కాకు రామ్, వయస్సు: 32 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, గ్రామం: హంగర్గా లను అదుపు లోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.




## పసికందు ప్రాణాల కోసం పోరాటం.. కాపాడండీ సార్

- **ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై 11 నెలల జష్విక్**
- **చికిత్సకు రూ.20 లక్షలు అవసరం.. భద్రత కవరేజ్ రాదన్న అధికారులు**
- **కన్నీరుమున్నీరవుతున్న కానిస్టేబుల్ కుటుంబం.. దాతల సాయం కోసం ఎదురుచూపు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 27(డీడీ9 వార్త) :**

శాంతిభద్రతలను కాపాడే విధుల్లో నిత్యం నిమగ్నమయ్యే ఒక పోలీస్ కానిస్టేబుల్.. నేడు తన 11 నెలల కుమారుడి ప్రాణాలను కాపాడుకోవడానికి దాతల సాయం కోసం ఆర్తిగా ఎదురుచూస్తున్నారు. తీవ్రమైన బ్లడ్ ఇన్‌ఫెక్షన్ కారణంగా కాలేయం, కిడ్నీలు, మెదడు దెబ్బతిని హైదరాబాద్ లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రి ఐసీయూలో వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతున్న తన చిన్నారి గంటా జష్విక్‌ను రక్షించుకోవడానికి ఆ తండ్రి పడుతున్న వేదన వర్ణనాతీతం.

కానిస్టేబుల్ గంటా నరేష్ కుమారుడు జష్విక్ క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. అత్యవసర చికిత్స నిమిత్తం వైద్యులు రూ.20 లక్షలు ఖర్చవుతుందని తేల్చి చెప్పారు. దురదృష్టవశాత్తూ ఈ చికిత్సకు భద్రత ఇన్సూరెన్స్ కవరేజ్ రాదని చెప్పడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఉన్నపళంగా అంత సొమ్ము సర్దడం సాధ్యం కాక, ఇప్పటివరకు దాచుకున్నదంతా హారతి కర్పూరంలా కరిగిపోవడంతో తక్షణ ఆర్థిక సాయం కోసం ఆ తండ్రి యావత్ సమాజాన్ని వేడుకుంటున్నారు. ఉదార హృదయులైన దాతలు స్పందించి ఆర్థికంగా అండగా నిలవాలని, తమ చిన్నారిని ప్రార్థనలతో, విరాళాలతో ఆదుకోవాలని కోరుతున్నారు. చిన్నారి జష్విక్ చికిత్స నిమిత్తం నేరుగా తండ్రి ఖాతాకే విరాళాలు పంపవచ్చు. ఫోన్ పే, గూగుల్ పే నెంబర్ 8008689977, 9505853446, ఎస్బిఐ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 39073968252 ఐఎసిఎఫ్సి కోడె నెంబర్ : SBIN0020376.





## అశ్రునయనాల మధ్య విజయ రెడ్డి అంత్యక్రియలు

- **- నిజామాబాద్, బోధన్ నుంచి తరలివచ్చిన నేతలు**

**బోధన్, నిజామాబాద్, మే 27(డీడీ9 వార్త) :**

మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు శనిగరం సంతోష్ రెడ్డి సతీమణి విజయ రెడ్డి (80) అంతిమయాత్ర మంగళవారం అశ్రునయనాల మధ్య సాగింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. ఈ నెల 25న హైదరాబాద్ కొండాపూర్‌లోని తన నివాసంలో కన్నుమూసిన విషయం విదితమే. విజయ రెడ్డి మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు కొండాపూర్‌లోని సంతోష్ రెడ్డి నివాసానికి తరలివచ్చి ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. శనిగరం సంతోష్ రెడ్డితో పాటు వారి కుమారుడు శ్రీనివాస్ రెడ్డి (వాసుబాబు), కుమార్తె మాధవీలత, అల్లుడు కెప్టెన్ కరుణాకర్ రెడ్డిలను పరామర్శించి, ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలి అంతిమయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యుడు డాక్టర్ భూపతి రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కార్పొరేషన్ల చైర్మన్లు మానాల మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి తదితరులు పాల్గొని పాడె మోశారు. అంతకుముందు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాజారామ్ యాదవ్ కొండాపూర్ నివాసంలో విజయ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. విజయ రెడ్డి అంత్యక్రియల నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు బోధన్ నియోజకవర్గ పరిధిలోని బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, అభిమానులు హైదరాబాద్‌కు తరలివచ్చారు.





## చెస్ టోర్నీలో గుకేశ్‌కు వింత అనుభవం.. వైరల్‌గా మారిన 'వాటర్ బాటిల్' వీడియో!

- **నార్వే చెస్‌లో గుకేశ్ బాటిల్ వీడియో వైరల్**
- **వెస్లీ చేతిలో ఓడిన భారత గ్రాండ్‌మాస్టర్**
- **116 ఎత్తుల సుదీర్ఘ పోరు డ్రాగా ముగింపు**
- **ఆర్మగెడాన్ రౌండ్‌లో వెస్లీ సో ఘన విజయం**
- **గాయంతోనూ ప్రజ్ఞానందపై గెలిచిన అలిరెజా ఫిరౌజా**

**డీడీ9 వార్త**

నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్‌కు వింత, సరదా అనుభవం ఎదురైంది. వెస్లీ సోతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ మధ్యలో గుకేశ్ వాటర్ బాటిల్ క్యాప్ తీయడానికి పడ్డ తిప్పలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆటలో తీవ్రంగా ఆలోచిస్తూ పక్కనే ఉన్న బాటిల్ మూత తీయడానికి ప్రయత్నించి అది రాకపోవడంతో అతడు బిక్కమొహం వేసిన విజువల్స్ నెటిజన్లను నవ్విస్తున్నాయి.

**చేజారిన విజయం**

క్లాసికల్ రౌండ్2 మ్యాచ్‌లో అమెరికా ఆటగాడు వెస్లీ సోపై గుకేశ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఏకంగా 116 ఎత్తుల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారథాన్ పోరులో గుకేశ్ విజయం సాధించేలా కనిపించాడు. అయితే వెస్లీ అద్భుతంగా డిఫెన్స్ చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించగలిగాడు. తర్వాత ఫలితం కోసం నిర్వహించిన 'ఆర్మగెడాన్' (టై బ్రేకర్) మ్యాచ్‌లో వెస్లీ పైచేయి సాధించి 1.5 పాయింట్లు ఖాతాలో వేసుకోగా, గుకేశ్ కేవలం ఒక పాయింట్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**వెస్లీ వివాదాస్పద వ్యాఖ్యలు**

సుదీర్ఘ పోరాటం తర్వాత ఓటమి పాలవడంతో గుకేశ్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన అసంతృప్తిని దాచుకోలేకపోయాడు. దీనికి తోడు వెస్లీ మాట్లాడుతూ.. గుకేశ్ ప్రస్తుత రేటింగ్ అతడి అసలు ప్రతిభకు అద్దం పట్టడం లేదంటూ కాస్త వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు ఈ ఓటమి మానసికంగా కాస్త నిరాశ కలిగించింది.

**గాయంతోనూ గెలిచిన ఫిరౌజా**

టోర్నీలోని ఇతర మ్యాచ్‌ల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. అలిరెజా ఫిరౌజా చీలమండ గాయంతో బాధపడుతూ, చేతికర్రల సాయంతో నడుస్తూనే భారత ఆటగాడు ప్రజ్ఞానందపై ఘన విజయం సాధించి తన ఫామ్‌ను చాటుకున్నాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ సైతం జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ చేతిలో ఓడిపోయే ప్రమాదం నుంచి తప్పించుకుని, ఆర్మగెడాన్ రౌండ్‌లో ఈ టోర్నీలో తన మొదటి విజయాన్ని నమోదు చేశాడు.



## ధోనీ భవిష్యత్తుపై సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ కీలక ప్రకటన!

- **సీఎస్కేను ఐదు సార్లు ఛాంపియన్ గా నిలిపిన ధోనీ**
- **జట్టులో ధోనీ ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు అభ్యంతరం లేదన్న సీఈవో**

**డీడీ9 వార్త**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు మహేంద్ర సింగ్ ధోనీ. సీఎస్కే అంటే ధోనీ, ధోనీ అంటే సీఎస్కే అనేంతలా ఆ జట్టుతో అతడి బంధం ముడిపడిపోయింది. అయితే, మోకాలి గాయం కారణంగా ధోనీ ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేకపోయాడు. దీంతో అతడి ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు క్రికెట్ వర్గాల్లో జోరందుకున్నాయి. ఈ ఊహాగానాలపై సీఎస్కే జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ ఒక సంచలన ప్రకటన చేశారు. ధోనీ జట్టులో ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆ నిర్ణయం పూర్తిగా అతడి వ్యక్తిగత ఇష్టానికే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు. "ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మాకు ఆనందమే. అతడు ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా అతడి ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది" అని సీఈవో వెల్లడించారు.



ధోనీ ఇంకా తన రిటైర్మెంట్‌పై అధికారిక ప్రకటన చేయనప్పటికీ, వచ్చే సీజన్ నాటికి అతడు సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో లేదా సపోర్ట్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే వార్తలకు ఈ వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. ముఖ్యంగా, సీఎస్కే హెడ్ కోచ్ పదవికి ధోనీని మించిన అర్హుడు మరెవరూ లేరని మాజీలు కూడా అభిప్రాయపడుతున్నారు.



## జై భీమ్ డైరెక్టర్‌తో సూర్య నెక్ట్స్ మూవీ!

ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు అనౌన్స్ చేస్తున్న కోలీవుడ్ స్టార్ సూర్య.. ఇప్పుడు తన 'సూర్య47' కోసం సిద్ధం అవుతున్నాడు. 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జీతూ మాధవన్ తెరకెక్కిస్తున్న ఇందులో నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మాలవుడ్ యగ్ హీరో నస్లెస్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుండగా.. సూర్య48కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ కోలీవుడ్ ఫిలిమ్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. సూర్య తన తదుపరి ప్రాజెక్టు 48కోసం 'జై భీమ్' డైరెక్టర్ టి.జె. జ్ఞానవేల్‌తో మరోసారి చేతులు కలిపినట్లు టాక్. 2021లో వచ్చిన 'జై భీమ్' చిత్రంలో సూర్య ప్రధాన పాత్రలో నటించి.. నిర్మించాడు. తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలై మంచి సక్సెస్‌ను అందుకుంది. ఇప్పుడు ఈ డైరెక్టర్‌తో సూర్య తన తదుపరి చిత్రం 'సూర్య48'ను చేసేందుకు సిద్ధం అయ్యాడట. ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తుండగా.. 'జగరం స్టూడియోస్' నిర్మించే అవకాశం ఉన్నట్లు టాక్. అంతే కాకుండా.. దీనిపై త్వరలో అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉన్నట్లు కోలీవుడ్ వర్గాల్లో వార్తలు వైరల్ అవుతున్నాయి. దీంతో.. హిట్ కాంబోతో మరో క్లాసిక్ హిట్ లోడింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.

### 'ధురంధర్' ప్రొడక్షన్ డిజైనర్‌పై
## లైంగిక వేధింపుల కేసు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. తాజాగా ఈ చిత్రానికి వర్క్ చేసిన ప్రొడక్షన్ డిజైనర్ సైనీ జోహ్రేపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చండీగఢ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

గతేడాది సెప్టెంబర్ 10న సినిమాకు సంబంధించిన చర్చల కోసం సైనీ తనను చండీగఢ్‌లోని ఒక హోటల్‌కు రావాలని కోరినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడికి వెళ్లాక అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. తాను అనారోగ్యానికి గురైనప్పటికీ, అక్కడి నుండి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే కెరీర్ దెబ్బతింటుందని నిందితుడు బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు



## రౌడీ కోసం 'కన్నప్ప' బ్యూటీ

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ 'రౌడీ జనార్ధన'. దిల్ రాజు నిర్మాణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో ఒక స్పెషల్ మాస్ సాంగ్ కోసం మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

అందుకోసం 'కన్నప్ప' చిత్రంతో టాలీవుడ్ దృష్టిని ఆకర్షించిన యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్ర యూనిట్ ఆమెతో సంప్రదింపులు జరిపిందని, దీనికి సంబంధించి మరికొద్ది రోజుల్లోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వినిపిస్తోంది. ఒకవేళ ఖరారైతే, ఇది క్రేజీ కాంబినేషన్ అనే చెప్పాలి. కాగా, ఈ సినిమా అవుట్‌పుట్ పట్ల చిత్ర బృందం చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు చిత్రీకరించిన సన్నివేశాలు చాలా అద్భుతంగా వచ్చాయని, విజయ్ దేవరకొండ మేనరిజమ్స్, రవి కిరణ్ మార్క్ టేకింగ్ ఈ సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్తాయని మేకర్స్ నమ్ముతున్నారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పక్కా బ్లాక్ బస్టర్ అవుతుందని టీమ్ గట్టి ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. మరి రౌడీ జనర్ధాన ఎలా ఉంటుందో చూడాలి.





### క్రేజీ మల్టీస్టారర్ కోసం అనిల్ రావిపూడి బిగ్ స్కెచ్..
## మ్యూజిక్ డైరెక్టర్‌గా ఆ కోలీవుడ్ స్టార్!

టాలీవుడ్ హిట్ మిషన్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తన 10వ సినిమా ప్రకటనతోనే ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు క్రియేట్ చేశారు. మన శంకరవరప్రసాద్ గారు వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత, ఆయన తన నెక్స్ ప్రాజెక్ట్‌ను విక్టరీ వెంకటేష్ - నందమూరి కల్యాణ్ రామ్ కలయికలో ఒక క్రేజీ మల్టీస్టారర్‌గా ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఫస్టాఫ్ స్క్రిప్ట్ లాక్ అవ్వగా, ప్రస్తుతం సెకండాఫ్ పనులపై అనిల్ అండ్ టీమ్ కసరత్తులు చేస్తున్నారు. అన్ని కుదిరితే జులై లేదా ఆగస్టు నెలల్లో ఈ క్రేజీ మల్టీస్టారర్ పట్టాలెక్కే అవకాశం ఉందని సమాచారం.




అనిల్ రావిపూడి తన సినిమాల కథల స్వభావాన్ని బట్టి ఎప్పటికప్పుడు మ్యూజిక్ డైరెక్టర్స్‌ను మారుస్తుంటారు. ఈసారి తన సరికొత్త స్క్రిప్ట్‌కు అద్భుతమైన స్వరాలు అవసరమని భావించి, కోలీవుడ్ స్టార్ కంపోజర్ జి.వి. ప్రకాష్ కుమార్‌ను రంగంలోకి దించారు. ఈ సినిమా కథ, కథనాలు ట్రెండీగా ఉంటూనే, అనిల్ రావిపూడి మార్క్ ఫన్ అండ్ ఎమోషన్స్‌తో సరికొత్త హంగులతో ఉండబోతోందని ఇండస్ట్రీ వర్గాల టాక్. ఈ మల్టీస్టారర్ చిత్రంలో కాస్టింగ్ మరింత కలర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తుంది. విక్టరీ వెంకటేష్ జోడీగా కీర్తి సురేష్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ పక్కన కృతి శెట్టి సందడి చేయనుంది. భారీ తారాగణంతో తెరకెక్కబోతున్న ఈ సినిమాను వచ్చే సంక్రాంతి (2027) పండుగ కానుకగా రిలీజ్ చేయడమే లక్ష్యంగా చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.

## ఒక్క పోస్టర్‌తో కథ చెప్పేశారు.. పెద్ది స్టోరీ ఇదేనా?

అసలు పెద్ది కథేంటి? అది తెలియాలంటే జూన్ 4న సినిమా విడుదలయ్యే వరకు వెయిట్ చేయాల్సిందే. కానీ ముందు నుంచి దర్శకుడు బుచ్చిబాబు పెద్ది కథ పై ఒక హింట్ ఇస్తు వస్తున్నాడు. నిజానికి ఈ సినిమా మల్టీస్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కింది. క్రికెట్, కుస్తీ, రన్నింగ్ లాంటి ఆటలు సినిమాలో కీలకంగా ఉండనున్నాయి. రామ్ చరణ్ ఆట కూలీగా కనిపించనున్నాడు. దీంతో.. ఇది మల్టీస్పోర్ట్స్ యాక్షన్ డ్రామా అని అంతా ఫిక్స్ అయిపోయారు. అలాగే.. ఊరికోసం పెద్ది చేసే పోరాటమే అసలు కథ అని టాక్ ఉంది. అయితే పెద్ది కోర్ పాయింట్ మాత్రం వేరే ఉందని లేటెస్ట్ పోస్టర్‌తో మరోసారి సాలిడ్ హింట్ ఇచ్చేశాడు బుచ్చి.







సరిగ్గా గమనిస్తే.. మొదటి నుంచి పెద్ది ప్రమోషనల్ కంటెంట్‌లో రైల్వే ట్రాక్‌ను హైలెట్ చేస్తు వస్తున్నారు. చికిరి సాంగ్‌లో, ట్రైలర్‌లోను ఇది క్లియర్‌గా కనిపిస్తుంది. ఇప్పుడు రిలీజ్ చేసిన పోస్టర్ అయితే.. రైల్వే ట్రాక్‌ను మరింత హైలెట్ చేస్తు ఉంది. ట్రాక్‌తో పాటు బ్లడ్ బాత్ అనేలా ఉన్నాడు రామ్ చరణ్. ఈ లెక్కన చూస్తే.. పెద్ది కథను సింపుల్‌గా ఒక లైన్‌లో చెప్పెయొచ్చు. తన ఊరికి రైల్వే ట్రాక్‌ను తీసుకురావడమే పెద్ది లక్ష్యంగా కనిపిస్తోంది. దానికోసం పెద్ది ఆడిన ఆటలు, పోరాటం సినిమాకే హైలెట్‌గా ఉండనున్నాయి. అలాగే ఎమోషనల్ పరంగా సినిమా పీక్స్‌లో ఉంటుందని ముఖ్యంగా రామ్ చరణ్ పర్ఫార్మెన్స్‌తో పెద్ది క్లైమాక్స్ సినిమాకు ప్రాణం పోసేలా ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. మొత్తంగా పెద్దిగాడు తన ఊరికోసం ఆడబోయే ఆట ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ ఇస్తుందని అంటున్నారు. మరి సినిమా ఎలా ఉంటుందో చూడాలి.

### అనుకోకుండా వచ్చింది..
## జీవితాన్నే మార్చేసింది..

సెకండ్స్ ఇన్నింగ్స్‌లో వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటూ వరుస సినిమాలు చేస్తున్న నటుడు సునీల్.. తాజాగా తన సినిమా 'కాటాలన్' ప్రమోషన్స్‌లో పాల్గొని 'పుష్ప'లో పాత్రపై ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాలో మంగళం శ్రీను పాత్రలో కనిపించిన సునీల్ తన యాక్టింగ్‌తో ఫుల్ పాపులారిటీ దక్కించుకున్నాడు. ఈ సక్సెస్‌పై సునీల్ మాట్లాడుతూ.. 'సుకుమార్ నుంచి నాకు వచ్చిన సర్‌ప్రైజింగ్ పాత్ర 'పుష్ప'లో మంగళం శ్రీను. ఈ సినిమా తర్వాత నా జీవితం ఊహించని విధంగా మారిపోయింది. దీంతో ఇతర ఇండస్ట్రీ దర్శకులు కూడా నన్ను సరికొత్త కోణంలో చూడటం స్టార్ట్ చేశారు. ఈ బ్రేక్‌తో 'జైలర్'లో ఆఫర్ వచ్చింది. ఇప్పుడు తమిళ సినిమా కాటాలన్‌లో 'మారి' అనే వపర్ ఫుల్ పాత్ర వచ్చింది. చాలా కాలం తర్వాత, నాకు ఎంతో సంతృప్తినిచ్చే ఒక పాత్ర లభించింది. ఇప్పుడు, వివిధ భాషల నుండి నాకు వైవిధ్యభరితమైన పాత్రలు వస్తున్నాయి. ప్రస్తుతం ఒక నటుడిగా,



### పనిలేని వెదవల గురించి
## నేను మాట్లాడను..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం జూన్ 4 ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస ఇంటర్వ్యూస్ ఇస్తూ సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతి బాబు తన పాత్రపై, అలాగే చరణ్‌పై వస్తున్న ట్రోల్స్‌పై స్పందించారు. 'పెద్ది' చిత్రంలో జగపతిబాబు 'అప్పలసూరి' అనే పవర్ ఫుల్ పాత్రలో కనింపించబోతున్నాడు. ఇది జగపతిబాబుకు రామ్ చరణ్‌తో రెండో సినిమా. మొదట రంగస్థలంలో విలన్‌గా నటించి మెప్పించి.. ఇప్పుడు పెద్దితో మరోసారి తన నెగిటివ్ షేడ్ చూపించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ క్రమంలోనే తన పాత్రపై మాట్లాడుతూ.. 'లెజెండ్ తర్వాత నేను దాదాపు 100 సినిమాలు చేశానని అనుకుంటున్నాను. కానీ నాకు కేవలం 5-6 పాత్రలు మాత్రమే గుర్తుండిపోయాయి. వాటిలో పెద్ది సినిమాలోని అప్పలసూరి పాత్ర ఒకటి. సినిమా విడుదలయ్యాక, కచ్చితంగా ఆ పాత్రే అగ్రస్థానాన్ని దక్కించుకోవచ్చు' అంటూ ధీమా వ్యక్తం చేశాడు.

ఇక చరణ్‌పై వస్తున్న ట్రోల్స్‌పై మాట్లాడుతూ.. 'పనిలేని వెదవలు గురించి నేను ఎక్కువ మాట్లాడను. ట్రోలింగ్ చేసేవాళ్ళు గుంటకాడ నక్కల్లాంటి వాళ్ళు. వాళ్లకు పనిలేక ఎవర్ని కిందకు లాగుదామా అని ఎదురు చూస్తారు. అసలు చరణ్ ఈ సినిమాకు ఎంతో కష్టపడ్డాడు.. ఎన్నో గాయాలు అయ్యాయి, ఎంత ఎఫర్ట్ పెట్టాడు, ఎంత కష్టపడ్డాడు ఇవన్నీ వదిలేసి ఏదో దొరికితే దాన్ని పట్టుకుంటారు. అసలు ఈవెంట్లో అన్నివేల మంది జనాలు, ఓ పక్క డబ్బింగ్, పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్‌కు సంబంధించి హీరోకు కాల్స్ వస్తున్నాయి. అలాగే మరో పక్క థియేటర్స్ ఇష్యూ నడుస్తుంది. ఇవన్నీ హీరో తలపై ఉంటాయి. అవన్నీ మోస్తూ ఇంత హడావిడిలో కొన్ని విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా మర్చిపోతాను. అంత ప్రెజర్‌లో అలాంటివి జరుగుతాయి. దీన్ని కూడా ట్రోల్స్ చేస్తారా... ఆ ట్రోలింగ్ చేసేవాళ్ళు నాలుగు రోజులు మాట్లాడతారు పోతారు. దీనివల్ల చరణ్‌కి ఏం కాదు' అని చెప్పుకొచ్చాడు. 'నన్ను కూడా ఏదో సీన్‌కి 70, 80 టేక్స్ తీసుకున్నా అని ట్రోల్ చేశారు. అసలు అది అబద్ధం. నేను మహా అయితే మూడు టేక్స్ తీసుకున్నా ఏమో హైయెస్ట్. దాన్ని కూడా ఫేక్ న్యూస్‌తో ట్రోలింగ్ చేశారు. పని లేకుండా ఇదే పనిగా వాళ్లు ఏదోఒకటి చేస్తూనే ఉంటారు' అని చెప్పుకొచ్చారు.

## చాలా నీచంగా కామెంట్స్ చేస్తున్నారు..

ఒకప్పటి హీరోయిన్ నమిత స్టార్ హీరోలతో నటించి బాక్సాఫీసును షేక్ చేసింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్టార్ హీరోలతో నటించి మెప్పించింది. ఇక తెలుగులో 'సొంతం' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఆమె ప్రభాస్, బాలకృష్ణ వంటి స్టార్స్ స్క్రీన్ షేర్ చేసుకునే అదృష్టాన్ని పొందింది. అయినప్పటికీ కెరీర్ పీక్స్‌లో ఉండగానే సినిమాలకు గుడ్ బై చెప్పేసింది. ఇక నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకుంటోంది.

తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నమిత ఎమోషనల్ కామెంట్స్ చేసింది. నమిత మాట్లాడుతూ.. "ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు నెటిజన్లు చేసిన కామెంట్లు చాలా దారుణంగా ఉన్నాయి. 'నీ అమ్మ క్యాన్సర్‌తో చనిపోవాలి', 'నీ పిల్లలు, నువ్వు పెంచుకునే జంతువులు కూడా చనిపోవాలి' అంటూ శాపనార్థాలు పెట్టారు. ఆ వ్యాఖ్యలు నన్ను మానసికంగా చాలా దెబ్బతీశాయి.

జీవితంలో మొదటిసారి అలాంటి ఘోరమైన మాటలు చదివినప్పుడు తట్టుకోలేక చాలా రోజులు ఏడ్చాను" అని ఎమోషనల్ అయ్యింది. బిగ్‌బాస్ షో గురించి స్పందిస్తూ.. "హౌస్‌లో జరిగే చిన్న చిన్న విషయాలను జనాలు చాలా ఓవర్‌గా జడ్జ్ చేస్తున్నారు. టీవీలో కనిపించే కేవలం ఒకటిన్నర గంటల ఎపిసోడ్‌ను చూసి, మా 24 గంటల రియాలిటీని, వ్యక్తిత్వాన్ని డిసైడ్ చేయడం అస్సలు సరికాదు. వేరొకరిపై నెగెటివ్ కామెంట్స్ చేసే ముందు, ఒక్కసారి వారి స్థానంలో నిలబడి ఆలోచించండి. నా వరకు నేను ఎలాంటి ట్రోల్స్ అయినా భరిస్తాను కానీ, నా ఫ్యామిలీ, నా పిల్లలు, నా స్నేహితుల జోలికి వస్తే మాత్రం నేను అస్సలు ఊరుకోను" అంటూ నమిత గట్టి వార్నింగ్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలపై జరుగుతున్న సైబర్ దాడి గురించి నమిత చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 501510.